క్లుప్తంగా

నేడు ధర్మభిక్షం జయంతి

చిలుకూరు : మాజీ ఎంపీ, గీత పనివారల సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని బుధవారం అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య మంగళవారం కోరారు. ధర్మభిక్షం జయంతి కార్యక్రమంలో గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ డాక్టర్ జి.సుశీల మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు కనీసం 5 నిమిషాలైన యోగా చేయాలని సూచించారు. పోషక విలువలు గల ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ సావిత్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

మునగాల : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో గల 100 సీట్లు, 7 నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష గడువు తేదీని ఈ నెల 22 వరకు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనరల్ విద్యార్థులు రూ.200లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125లు ఫీజును ఈనెల 22లోగా చెల్లించాలన్నారు. ఏప్రిల్ 16 ఉదయం ఆరవ తరగతి విద్యార్థులకు, 7 నుంచి పదవ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి జెడ్పీటీసీ విరాళం

పాలకవీడు : మండలంలోని మూసీఒడ్డుసింగారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో రామాలయం నిర్మాణానికి జెడ్పీటీసీ మాలోతు బుజ్జి మోతీలాల్ మంగళవారం రూ.10వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో 200 సిమెంటు కట్టలు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకులు కోటయ్య, భూపాల్‌రెడ్డి, కోటయ్య, సైదులు, ఇమామ్, బషీర్, శ్రీరాములు పాల్గొన్నారు.

సాయి మందిరానికి రూ. 50 వేలు అందజేత

నడిగూడెం : దాతల సహకారం అభినందనీయమని శ్రీషిర్డీ సాయి ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిర ఆవరణలో భోజనశాల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన రిటైర్డు విద్యాధికారి కట్టికోల యాదగిరిరావు -భారతి దంపతులు రూ.50 వేలను మంగళవారం ఆలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, గౌరవ సలహాదారు పసుపులేటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : సికింద్రాబాద్‌లోని వెస్లీ కాలేజీలో బుధవారం (రేపు) నిర్వహించబోయే దళిత క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పాస్టర్ శామ్యూల్ గుండు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్లు టి.సుధాకర్, సామ్యూల్, పీటర్ హనోక్, ప్రసాద్, జాన్‌పాల్, ఇస్సాకు, జేమ్స్, అభిషేక్, ఆదాం, డేవిడ్ రాజు, కృపాదానం పాల్గొన్నారు.

రెడ్ల ఆత్మీయ సభ పోస్టర్ ఆవిష్కరణ



మోతెలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి జాగృతి నాయకులు

మోతె : సూర్యాపేటలో ఈనెల 26న నిర్వహించబోయే రెడ్ల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని రెడ్డి జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో రెడ్ల ఆత్మీయ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు సురకంటి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎడవెల్లి రంగారెడ్డి, ఆంధ్రారెడ్డి, బొక్క వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో బిల్లు పెట్టాలి

గరిడేపల్లి : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టాలని దళిత క్రైస్తవ సమితి (డీసీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ కేజే ఉదయ్‌బాబు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన దళిత క్రైస్తవ సమితి అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవుల హక్కుల కోసం గత 15 ఏళ్లుగా దళిత క్రైస్తవ సమితి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ ప్రతినిధులు కొండ రవి, ప్రశాంత్, గిరిబాబు, అంజిబాబు, అరవింద్, వరుణ్ రాజు, సామ్యూయేల్ తదితరులున్నారు.

ప్రతి ఇంటికీ భగీరథ నీరందించాలి

● ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలన్నారు. నూతన పైప్ లైన్ల ఏర్పాటు, లీకేజీల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ జి.కృపాకర్‌రెడ్డి, ఎస్ఈ సురేష్, ఇంట్రా ఈఈ పాపారావు, గ్రిడ్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అనేక పథకాలు

హుజూర్‌నగర్ : రాష్ట్ర ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం అనేక పథకాలు తెచ్చిందని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌గర్‌లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించిన ఎన్‌సీడీ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని పీర్లకొట్టం బజార్‌లో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ కోటచలం, ఎన్‌సీడీపీఓ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మండల వైద్యాధికారి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని సోమవారం గ్రామస్తులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆ రోడ్డును పరిశీలించి డీఈ మహిపాల్‌రెడ్డితో మాట్లాడారు. పగిలిన మిషన్ భగీరథ పైపులైన్‌లను త్వరితగతిన వేసి రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గడ్డిపల్లిలోని పల్లె పకృతి వనాన్ని సందర్శించి వన సేవకుడు పురుషోత్తంను అభినందించారు. ఎమ్మెల్యే వెంట ఏఈ శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ నాగేశ్వర్‌రావు, ఎంపీటీసీ శ్రవంతి, మాశెట్టి శ్రీహరి తదితరులున్నారు.



మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి

గోపాల్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

గరిడేపల్లి : శ్రీఅరబిందో గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు, డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో ఘంట గోపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల్‌రెడ్డి కేవీకేను ఏర్పాటు చేసి రైతుల అభివృద్ధికి ఎంతో తోడ్పడ్డారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ సైదిరెడ్డి, ఎంపీటీసీ స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్, శ్రీహరి తదితరులున్నారు.



గరిడేపల్లి : ఘంటా గోపాల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

చదువులో రాణించేలా కృషిచేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులు చదువులో రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగడ్డలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ షేక్ సలీమారంజాన్, కడియం వెంకటరెడ్డి, గువ్వల వీరయ్య, అలీపాషా, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామపెద్దలు ఉన్నారు.

ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం కోదాడలోని ఎస్ఆర్ఎం పాఠశాలలో అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందుల కిట్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడలో త్వరలో డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ కోటాచలం కోరారు. మంగళవారం ఎస్ఆర్ఎం పాఠశాలలో రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని కంటి సమస్య బాధితులను శిబిరాల వద్దకు తీసుకురావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా కవిత, కౌన్సిలర్ కట్టెబోయిన జ్యోతి, వైద్యులు కళ్యాణ్‌చక్రవర్తి, బంకా వీరేంద్రనాథ్, వేణు, విజయ్, మధుబాబు బీఆర్ఎస్ నాయకులు చందు నాగేశ్వరరావు, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, సంపెట ఉపేందర్, తాజ్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సర్వారం గ్రామంలో నిర్వహించిన శక్తి కేంద్రాల స్ట్రీట్ కర్నార్ సమావేశంలో ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ఫసల్ బీమా యోజన, ఉజ్వల గ్యాస్, ఈ- శ్రమ్, ఆయుష్మాన్ భారత్, ఎరువుల సబ్సిడీ, జీవన్ జ్యోతి లాంటి పథకాల గురించి ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రాల హుజూర్‌నగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ అంబళ్ల నరేష్‌గౌడ్, సహ కన్వీనర్ గుండెబోయిన వీరబాబు, మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, ప్రధాన కార్యదర్శి జనిగల శ్రీనివాస్, రాధాకృష్ణ, బూత్ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

అగ్రహారం, కొనాయిగూడెం గ్రామాల్లో..

మండలంలోని అగ్రహారం, కొనాయిగూడెం గ్రామాల్లోని 270, 271 శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు చిత్తలూరి సోమయ్య, వల్లెల సైదులు, కారింగ్‌ల పాపయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా గోస - బీజేపీ భరోసా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ప్రమీల, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, హుజూర్‌నగన్ పట్టణ అధ్యక్షుడు చంద్రారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, రామినేని కృష్ణయ్య, మంద వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం నిర్వహించాలి

పాలకవీడు : ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని బొత్తలపాలెంలో 62, 63, 64 బూత్‌లలో నిర్వహించిన శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నరేష్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, లాజరు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బా భాగ్యారెడ్డి

కోదాడలో స్ట్రీట్ కార్నర్ సమావేశం

కోదాడఅర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందని ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర మల్సూర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని 22వ వార్డులో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ గోదేసి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో బూత్ కమిటీ అధ్యక్షుడు గోదేశి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు నకిరికంటి జగన్‌మోహన్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సాతులూరి హనుమంతరావు, ఓరుగంటి పురుషోత్తం, ఆర్టీఏ కన్వీనర్ కొండ్లే రవికుమార్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు కోటకొమ్ముల భాగ్యమ్మ, సోషల్ మీడియా కన్వీనర్ కొమరగిరి గోపాల్, రౌతు కల్యాణ్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నడిగూడెం : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ యం.యర్రయ్య కోరారు. మంగళవారం మండల పరిధిలోని తెల్లబల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన అనంతరం కూలీలతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం పనులు చేస్తే కూలీ పడుతుందన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలి

మఠంపల్లి : ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానాన్ని ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీఐటీయూ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న తాత్కాలిక కార్మికుల సర్వీసులు క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీను, పాండు, బాలు, రస్మియా, రాము తదితరులున్నారు.

సోమప్ప జాతరపై సమీక్షా సమావేశం

నేరేడుచర్ల : మండలంలోని బురుగులతండా వద్ద గల సోమప్ప దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజులు జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మండల తహసీల్దార్ వాసిమళ్ల సరిత అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శంకరయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రవంతి, మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్అండ్‌బీ ఏఈ శివకుమార్, ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి, నేరేడుచర్ల ఎస్ఐ నవీన్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్, దేవదాయ శాఖ ఈఓ మృత్యుంజయశాస్త్రి, ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు, సర్పంచ్ రోజా, మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి, ఎంపీఓ విజయలక్ష్మి గ్రామ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

పుల్వామా అమరవీరులకు నివాళి



నడిగూడెంలో..



హుజూర్‌నగర్‌లో..

నడిగూడెం : పుల్వామా ఘటనలో మృతి చెందిన సైనికులకు మంగళవారం మండల కేంద్రంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.ఏడుకొండలు, ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి, పీఈటీ పల్లపు నాగేశ్వరరావు, చేయూత ఫౌండేషన్ ప్రతినిధులు మండవ నరేష్, మేకల వీరబాబు, కాసాని వెంకటేష్, మేకల వీరేష్, బాణాల సతీష్, మీర్జా మోసిన్, నక్క సందీప్, పందిటి నవీన్, హరీష్, శరత్, సాయి పాల్గొన్నారు.

ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్ : పుల్వామా దాడి ఘటనలో వీరమరణం పొందిన సైనికులను స్మరిస్తూ మంగళవారం రాత్రి హుజూర్‌నగర్‌లో ధర్మ జాగరణ సమితి, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శాంతి స్థూపం వద్ద అమరజవాన్లకు కొవ్వత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో గొట్టె కిరణ్, కొత్తపల్లి శివకుమార్, పెండెం నరేష్, కొప్పెర సాయి శేఖర్, ఉదయ్, జక్కుల వెంకటేష్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

● డీఎంహెచ్‌ఓ కోటాచలం

హుజూర్‌నగర్ : నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డీఎంహెచ్‌ఓ కోటాచలం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న బస్తీ దవాఖానాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లోని నిరుపేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం బస్తీ దవాఖానాను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి 10 వేల మందికి ఒకటి చొప్పున బస్తీ దవాఖానాలను దశల వారీగా ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్, ఒక నర్స్ ఉంటారని, మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు, ప్రాథమికంగా చికిత్స అందిస్తారని వివరించారు. ఆయన వెంట జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, బి.సైదులు, డాక్టర్ పుష్పలత, హెచ్ఈఓ జి.ప్రభాకర్, ఆరోగ్య కార్యకర్తలు మాధవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

చిలుకూరు : టాలెంట్ టెస్టుల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయబడుతుందని ఫిజికల్ సైన్స్ ఫోరం మండల కన్వీనర్ చందా శ్రీనివాస్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల స్థాయిలో ఫిజికల్ సైన్స్ ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కాగా చిలుకూరు జెడ్పీ పాఠశాలకు చెందిన పరిమళ ఇంగ్లిష్ మీడియంలో, రామాపురం జెడ్పీ పాఠశాలకు చెందిన జానీబీ తెలుగు మీడియంలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఈ నెల 20న జరిగే జిల్లా స్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు గుండు ఆదినారాయణ, రామారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు భరత్, సిద్దు, దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి ప్రణవీ, మేదారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి శాలినీ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు సైన్స్ కోఆర్డినేటర్ సైదులు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను నేరేడుచర్ల, దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాస్‌రావు, మధు అభినందించారు. ఉపాధ్యాయులు శ్యామ్, మాధవి, శౌరీ, కృష్ణప్రసాద్, రాంబాబు ఉన్నారు.



నేరేడుచర్ల : విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, మధు

వీఎల్ఎన్ గౌడ్‌కు సన్మానం

నడిగూడెం : గ్రామీణ వైద్యుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా మండల పరిధిలోని రత్నవరం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు వీఎల్ఎన్.గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం రత్నవరంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కురాకుల కృష్ణమూర్తి, కాసాని శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత



ట్రైసైకిల్ అందజేస్తున్న సర్పంచ్ బాబునాయక్

గరిడేపల్లి : మండలంలోని గారకుంటతండాలో గుగులోతు బాబు- సంధ్య కుమారుడుకి హెచ్ఎన్ బ్రదర్స్ నరేందర్‌నాయక్ చొరవతో ప్రభుత్వం నుంచి మంజూరైన ట్రైసైకిల్‌ను సర్పంజ్ గుగులోతు బాబునాయక్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంగతి, సైదానాయక్, సందీప్‌నాయక్, వార్డు సభ్యులు సక్కి, విద్యా కమిటీ చైర్మన్ బచ్చలకూరి కోటయ్య, రాములునాయక్, ధర్మానాయక్, భీమానాయక్, పండిత్ నాయక్ తదితరులున్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 23వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యహోమం, సహస్రనామార్చన, బలిహరణ, మంగళాశాసనం, నీరాజన మంత్రపుష్పాలతో అభిషేకం, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి ముగ్గుల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో లింగగిరి ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, ఉపసర్పంచ్ సావిత్రి, అన్నెం కొండారెడ్డి, పద్మారెడ్డి, ధర్మారి వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ అన్నెం శిరీష

త్రీఫేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ధర్నా

చిలుకూరు : త్రీఫేజ్ కరెంట్ అంతరాయంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట స్థానిక టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయానికి కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రైతులు పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డా గురవయ్య, నాయకులు కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, శ్రీమన్ నారాయణ, మరీదు శ్రీను, గుండు వీరబాబు, మస్తాన్, కొల్లు కోటేశ్వరరావు, కొల్లు రాంకోటి, చంటి, హరీష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వాలి

మునగాల : విద్యుత్ కోతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే వ్యవసాయ రంగానికి నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఏడీఈ రవికుమార్ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ సైదా, సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య, బచ్చలకూర స్వరాజ్యం, మండవ వెంకటాద్రి, బట్టు నాగయ్య, ఆరె.రామకృష్ణారెడ్డి, జానిరెడ్డి, మల్లారెడ్డి, ధర్మయ్య, వీరస్వామి, వీరబాబు పాల్గొన్నారు.



మునగాలలో ట్రాన్స్‌కో ఏడీఈకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

విద్యుత్ లేక ఎండిపోతున్న పొలాలు

హుజూర్‌నగర్ : వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి పి.హుస్సేన్ అన్నారు. వ్యవసాయానికి 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు అందించాలని కోరుతూ మంగళవారం హుజూర్‌నగర్ విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద ధర్నా చేసి డీఈ వెంకటకిష్టయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యుత్ మోటార్లపై ఆధారపడి 30 వేల ఎకరాలలో వరి పంటలు సాగు చేసుకుంటున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.యోన, ఆర్.మురళి, వెంకటనారాయణ, వీరబాబు, నాగేశ్వరరావు, వెంకన్న, వీరయ్య, రాములు, సైదా, వెంకటయ్య, శ్రీను, గోపరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషిచేస్తాం



కంపెనీ అధికారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మోతె : విద్యాభివృద్ధికి కృషి చేస్తామని బ్రూక్ ఫీల్డ్ కంపెనీ డైరెక్టర్ పూజ టాండన్ అన్నారు. మండల పరిధిలోని నామవరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రూక్ ఫీల్డ్ కంపెనీ సహకారంతో నిర్మించిన గ్రంథాలయం, డిజిటల్ క్లాస్ రూమ్స్ నూతన భవనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులకు తమ వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బీఎల్ఎన్ చారి, కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ అంకుర మల్లిక్, జనరల్ మేనేజర్ కిషోర్, గ్రామ సర్పంచ్ తండు యాదమ్మ మల్సూర్, ఎస్ఎంసీ చైర్మన్ వీరబోయిన నాగమణి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

పాలకవీడు : కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం గుడుగుంట్లపాలెం గ్రామంలో కంటి వెలుగు క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కంటి పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు బూషిపల్లి వెంకట్‌రెడ్డి, రామారావు, నరసింహ, వార్డు సభ్యులు, వైద్యులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ, జెడ్పీటీసీలు పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సర్వారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులున్నారు.



గరిడేపల్లి : సర్వారంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మధ్యాహ్న భోజనం పరిశీలన

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీలావెంకటరమణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.

వడ్లను వలిచి తలంబ్రాల బియ్యం తయారు

కోదాడఅర్బన్ : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో ఉన్న శ్రీగుంటి రఘునాథస్వామి ఆలయంలో భద్రాచలం సీతారాముల కల్యాణానికి గోటితో వడ్ల నుంచి బియ్యాన్ని తీసే కార్యక్రమాన్ని మంగళవారం మహిళలు ప్రారంభించారు. అంతకు ముందు ఆలయంలోని మండపంలో బ్రహ్మశ్రీ వంగీపురపు పవనకుమారాచార్యులు పర్యవేక్షణలో శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ గుడుగుంట్ల రంగయ్య, పూజారులు రాఘవాచార్యులు, కృష్ణమాచార్యులు, శ్రీమహాలక్ష్మి బృందం సభ్యులు రామిశెట్టి కృష్ణవేణి, వి.స్వాతి, నీలం అన్నపూర్ణ, సాయిబాబా, భక్తులు పాల్గొన్నారు.



తలంబ్రాల బియ్యాన్ని తయారు చేస్తున్న మహిళలు

ఉచిత పశువైద్య శిబిరం

నేరేడుచర్ల : మండలంలోని చిల్లేపల్లిలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కొడిద మనోజ్ మంగళవారం ప్రారంభించారు. కాగా ఈ శిబిరంలో 28 గేదెలకు గర్భకోశ చికిత్సలు చేశారు. 10 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి రవినాయక్, ఎంపీటీసీ శ్రీలక్ష్మి, సిబ్బంది సబేరా, స్వప్న, భాస్కర్, గోపాలమిత్రలు భుజంగరావు, సాయికృష్ణ, రైతులు తదితరులున్నారు.